క్లుప్తంగా

వీరన్నకు సత్కారం



దేచెర్లలో వీరన్నను సత్కరిస్తున్న గ్రామస్తులు

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్నను ఐ.పంగిడి శివారు గ్రామం దేచెర్లలో ప్రజలు ఘనంగా సత్కరించారు. అక్కడి అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో అభినందన సభ నిర్వహించారు. తమ గ్రామ పంచాయతీకి చెందిన వీరన్నకు జిల్లా స్థాయి పదవి కేటాయించడంపై పలువురు ఆనందం వ్యక్తం చేశారు. వీరన్నకు శాలువా వేసి పూలమాలలతో సత్కరించారు. బోడ బ్రహ్మయ్య, కంచుమర్తి బాలశంకరం పంతులు, బొంతా నాగేశ్వరరావు, నూకతట్టి భూపతి తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుల దుకాణాల తనిఖీ



దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ చంద్రశేఖర్

నల్లజర్ల: ఎరువులను నిర్దేశించిన ధరల కంటే ఎక్కువకు విక్రయించినట్లు తెలిస్తే ఆయా డీలర్లపై చర్యలు తీసుకుంటామని కొవ్వూరు డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ పి.చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలో వివిధ గ్రామాల్లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈపాస్ ద్వారా ఎరువులు విక్రయించాలని, స్టాకు రిజిస్టర్లు, ధరల పట్టికలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని డీలర్లకు సూచించారు. ప్రతి నెలా మొదటి వారం వ్యవసాయాధికారికి ఎరువుల రిపోర్టు ఇవ్వాలన్నారు. మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్, ఏఈఓ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ఉండ్రాజవరం: పీఎం మాతృత్వ సురక్ష అభియాన్‌లో భాగంగా ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రసూతి వైద్య నిపుణులు అయేషా బేగం, పీహెచ్‌సీ వైద్యురాలు ఆర్.ఉషారాణి ఆధ్వర్యంలో సుమారు 25 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యుడు ఆర్ఎస్ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. పీహెచ్ఎన్ కుమారి, సూపర్‌వైజర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగులను నివారిద్దాం

నల్లజర్ల: విద్యార్థులలో రక్తహీనతను నివారించడానికి ఈ నెల 14 నుంచి జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమం చేపట్టనున్నట్లు పీహెచ్‌సీ వైద్యుడు తెల్లం గంగాధరరావు వెల్లడించారు. దీనిపై గురువారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో వైద్య, ఆరోగ్య శాఖతో పాటు మండల పరిషత్, సీడీఎస్, విద్యాశాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. అంగన్‌వాడీ, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 14,300 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని గ్రామాల్లోని అంగన్‌వాడీ, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు సంయుక్తంగా నిర్వహించాలన్నారు. ఎంపీడీఓ జోగేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఉపాధ్యాయుడు గంగరాజు, సీహెచ్‌ఓ చంద్రశేఖరరాజు, ఆరోగ్య సహాయకుడు జీవీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సారా కేసులో వ్యక్తి అరెస్ట్

కొవ్వూరు: సారా విక్రయిస్తున్న కేసులో తుపాకులగూడెం గ్రామానికి చెందిన శీలబోయిన సత్యనారాయణను గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. అతని నుంచి మూడు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇదే కేసులో రాయుడు దానయ్యబాబును అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు.

యువతి అదృశ్యం

నిడదవోలు రూరల్: తాడిమళ్లకు చెందిన ఓ యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ గురువారం తెలిపారు. ఆమె నిడదవోలులో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 7న ఇంటి నుంచి కళాశాలకు వెళ్లిన తన కుమార్తె అప్పటి నుంచి కనిపించడం లేదని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నల్లజర్ల: ఘంటావారిగూడెంలో హైవే పక్కన సర్వీసు రోడ్డులో గురువారం ఉదయం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుని వివరాల కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. ఆ వ్యక్తి వివరాలు తెలిస్తే నల్లజర్ల పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్లు 94407 96614, 99590 66999కు తెలియజేయాలని ఎస్ఐ నరసింహమూర్తి కోరారు. మృతి చెందిన వ్యక్తి ఉదయం 5 గంటల సమయంలో వాకింగ్ చేసేవారికి పాతూరి శ్రీనివాసరావు పొలం వద్ద కూర్చుని కనిపించాడని, చార్జీలకు డబ్బులు కావాలంటే రూ.100 ఇచ్చామని స్థానికులు చెబుతున్నారు.

చేతిరాత మార్చుకుందాం..

- చక్కని దస్తూరితో మంచి మార్కులు
- 'పది' విద్యార్థులు దృష్టి పెట్టాలని నిపుణుల సూచన



దూబచర్ల జెడ్పీ హైస్కూల్‌లో చేతిరాతపై శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

నల్లజర్ల: అందమైన చేతిరాతతో అందలం పొందవచ్చు.. పరీక్షల్లో మెరుగైన మార్కులు సాధించవచ్చు.. మనం ఎంత చదివి రాసినా అది ఉపాధ్యాయులకు అర్థం కాకపోతే ఫలితం ఉండదు. మనం చదివింది చక్కగా రాస్తేనే మంచి మార్కులు వస్తాయి. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. వచ్చే నెల 3వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ జరగనున్నాయి. నల్లజర్ల మండలంలో మొత్తం 8 జెడ్పీ హైస్కూళ్లు, 9 ప్రైవేటు హైస్కూళ్లు ఉన్నాయి. పదో తరగతి పరీక్షలకు మండలంలో ఆరు సెంటర్లను కేటాయించారు. మొత్తం 1,035 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రస్తుతం విద్యార్థుల ధ్యాస అంతా చదువుపైనే ఉంది. కాస్త చేతి రాతపైనా కూడా దృష్టి పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. పరీక్షల్లో సమాధానాలను ఉన్నది ఉన్నట్టుగా రాసినా.. దస్తూరి ఎంత బాగుందన్నదే ముఖ్యం. ఏం రాశామన్నది పేపర్ మూల్యాంకనం చేసే వ్యక్తికి అర్థమైతేనే ఎక్కువ మార్కులు వేసేందుకు అవకాశం ఉంటుంది. ఏడాది పాటు చదివిన అంశాలను రెండున్నర గంటల్లో ఆన్సర్ షీట్‌పై పెట్టాలి. పరీక్షల సమయంలో సహజంగా ఆందోళన ఉంటుంది. మొదటి ప్రశ్నకు సమాధానం చక్కగా రాసి తర్వాత వేగం పెరిగి కొందరు అందంగా రాయలేకపోతుంటారు. దీన్ని అధిగమించాలంటే ముందుగానే దస్తూరిపై సాధన చేస్తే పరీక్షల్లో ఇబ్బందులు ఉండవని నిపుణులు అంటున్నారు. ఆణిముత్యాలు లాంటి అక్షరాల కోసం కొన్ని ప్రాథమిక సూత్రాలను పాటించాలని దూబచర్ల జెడ్పీ హైస్కూల్ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు బొందల శ్రీనివాసరావు చెబుతున్నారు. తమ స్కూల్‌లో విద్యార్థులకు అక్షరాలు అందంగా రాయడానికి ముందు నుంచే శిక్షణ ఇస్తున్నామని వివరించారు.

ఈ జాగ్రత్తలు తీసుకుంటేనే..

- పరీక్షల్లో సమాధాన పత్రంలో రాసే జవాబు సూటిగా ఉండడంతో పాటు అక్షరాలు పొందికగా ఉంటే పేపరు దిద్దేవారు మార్కులు అదనంగా వేసే అవకాశం ఉంటుంది.
- పేజీ పైభాగంలో ఒక అంగుళం, ఎడమ వైపు అదే స్థాయిలో మార్జిన్ విడిచిపెట్టాలి.
- సామాన్య, భౌతిక శాస్త్రాల్లో బొమ్మలు గీసి భాగాలు గుర్తించే విషయంలో పెన్నును ఒత్తి పెట్టి రాయకూడదు. ఇలా చేస్తే పేపరు వెనుక అచ్చు పడి అక్షరాలు సక్రమంగా కనిపించవు. దీనివల్ల ఇబ్బంది వస్తుంది.
- పేజీలో వాక్యాలు పైనుంచి కిందకు లేదా పైకి ఉండకుండా వరుస క్రమంలో ఉండాలి.
- పేజీకి పదహారు నుంచి ఇరవై లైన్లు మించి రాయకూడదు.
- రోజూ కొద్ది సమయం సాధన చేస్తే పరీక్షలలో ఆందోళన లేకుండా సాఫీగా రాయవచ్చు.
- పెన్ను సక్రమంగా పట్టుకొని రాస్తే రాసే అక్షరాలు మనకు కనిపించడంతో పాటు అక్షరాలు గుండ్రంగా ఉంటాయి.
- జవాబులు రాసేటప్పుడు ప్యాడ్ పైకి వాలిపోకుండా సాధ్యమైనంత వరకూ కూర్చుని రాయడం మంచిది.
- అక్షరాలు, పదాలు, వాక్యాలు మధ్య తగినంత ఖాళీ ఉండాలి.

ప్రాధాన్యం పెరుగుతోంది



శాస్త్ర, సాంకేతిక రంగం ఎంత ఎదిగినా చేతి రాతకు ప్రాధాన్యం పెరుగుతూనే ఉంది. సంబంధిత భాషపై పట్టు ఉంటే రాయడం తేలిక అవుతుంది. దస్తూరి బాగున్న విద్యార్థులు అదనంగా మార్కులు పొందేందుకు అవకాశం ఉంటుంది. తమ పాఠశాలలో దీనిపై తర్ఫీదు ఇస్తున్నాం.

– బి.సుమతి, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం, దూబచర్ల

అలా రాస్తే అదనపు మార్కులు



అదనపు మార్కులకు చేతిరాత చాలా ముఖ్యం. చేతి రాతను బట్టి విద్యార్థి సామర్థ్యాన్ని అంచనా వేయవచ్చు. పాఠశాల సముదాయ సమావేశాల్లో ఇదే విషయాన్ని అధికారులు స్పష్టం చేస్తున్నారు. విద్యార్థి రాసే సమాధానంతోనే కాదు దస్తూరి బాగుంటే కూడా మార్కులు వేస్తారు. మానసిక ఒత్తిడితో రాయకూడదు.

– బొందల శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు, దూబచర్ల జెడ్పీ హైస్కూల్

పొగాకు రైతు కుటుంబానికి సాయం



మృతుని భార్యకు సాయం అందజేస్తున్న ప్రసాద్

దేవరపల్లి: సంగాయగూడేనికి చెందిన పొగాకు రైతు సరళం పెద్దనారాయణ (45) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. ఆ రైతు కుటుంబాన్ని పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్ పరామర్శించి పొగాకు బోర్డు రైతు సంక్షేమ నిధి నుంచి తక్షణ సాయంగా రూ.20 వేలు అందజేశారు. మరో రూ.30 వేలు త్వరలో అందజేస్తామని ఆయన తెలిపారు. వైఎస్సార్ బీమా పథకంలో రూ.10 వేలు అందించగా మరో రూ.90 వేలు ప్రభుత్వం ద్వారా వస్తాయని అధికారులు తెలిపారు. ఈ సహాయాన్ని సర్పంచ్ కుసులూరి ఉషారాణి, ఎంపీటీసీ సభ్యురాలు సుంకవల్లి చినవెంకనాగదుర్గ చేతుల మీదుగా ఇచ్చారు. పొగాకు వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు కుసులూరి శ్రీనివాస్, పొగాకు బోర్డు సీనియర్ గ్రేడింగ్ అధికారి శివకుమార్, క్షేత్రస్థాయి అధికారి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

అన్నింటా 'ఆమె'దే అగ్రస్థానం



కానూరులో మహిళలను సన్మానించిన ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, ప్రజాప్రతినిధులు



నిడదవోలులో మహిళా దినోత్సవ వేడుకల్లో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుజాత తదితరులు

పెరవలి: అన్ని రంగాల్లో అతివలే అగ్రస్థానంలో నిలుస్తున్నారని, వారంతా ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధించాలని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అన్నారు. గురువారం కానూరులోని ఐకేపీ కార్యాలయంలో మహిళా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు మనోధైర్యంతో ముందుకు వెళ్లాలని, అప్పుడే అనుకున్నది సాధిస్తారన్నారు. సమాజంలో మహిళల రక్షణకు ప్రభుత్వం దిశా చట్టాన్ని తీసుకు వచ్చిందన్నారు. మహిళలు స్వేచ్ఛగా తిరిగినప్పుడే నవసమాజం ఏర్పడుతుందని తెలిపారు. ప్రతి ఆడపిల్లనూ చదివించాలని అన్నారు. అనంతరం వివిధ రంగాలకు చెందిన పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు వీరమళ్ల దుర్గ, పార్టీ మండల అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకుడు కొమ్మిశెట్టి రాము, సర్పంచ్ మధు, తోట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సాధికారత దిశగా అడుగులు

నిడదవోలు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో మహిళలు సాధికారత వైపు అడుగులు వేస్తున్నారని జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కాలాబత్తుల సుజాత అన్నారు. నిడదవోలు మండల సమాఖ్య కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ తాము ఎంచుకున్న రంగాల్లో మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితేనే విజయం సాధించగలరన్నారు. ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత, విద్యాదీవెన, వసతిదీవెన, సంపూర్ణ పోషణ తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనంతరం సుజాత, ఎంపీపీ భాగ్యలక్ష్మిని ఘనంగా సన్మానించారు. మండల సమాఖ్య కార్యదర్శి పాటంశెట్టి ప్రభావతి, ఏపీఎం బి.నాగరాజు, స్త్రీనిధి ఏరియా కోఆర్డినేటర్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో..

దేవరపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, సర్పంచ్ కడిమి వీరకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు రామలక్ష్మి, పలువురు మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఉస్సే శంకరుడు, కార్యదర్శి ఎంఎస్ మహాలక్ష్మి, మండల నాయకులు శివరాజు, నాగేంద్రప్రసాద్, ఉమాకాంత్, ఆంజనేయులు, గోపాలకృష్ణ, నిరంజన్, రమాజానకి పాల్గొన్నారు.

18 నుంచి 'మా నమ్మకం నువ్వే జగన్'

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



దేవరపల్లిలో మండల కన్వీనర్లతో చర్చిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 18 నుంచి 26 వరకూ గోపాలపురం నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో 'మా నమ్మకం నువ్వే జగన్' ప్రచార కార్యక్రమం నిర్వహిస్తామని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. దీనిని మండల గృహ సారథులు, కన్వీనర్లు, మండల పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో వార్డు సారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్ల సమన్వయంతో నిర్వహిస్తామన్నారు. గురువారం దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల గృహ సారథులు, కన్వీనర్లతో ఈ కార్యక్రమంపై చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గృహ సారథులు, గ్రామ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వివరిస్తారన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు, ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల మధ్య తేడాను ప్రజలకు వివరించాలని ఆయన తెలిపారు. ప్రతి ఇంటి వద్ద కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు స్టిక్కర్ అంటించి, ప్రజా మద్దతు పుస్తకం అందజేయాలని ఆయన కన్వీనర్లకు సూచించారు. లబ్ధిదారుల మొబైల్ ఫోన్‌పై స్టిక్కర్లు అంటించాలని ఆయన తెలిపారు. గత, ప్రస్తుత ప్రభుత్వాలను పోల్చే కరపత్రాలు ఇంటింటికీ అందజేయాలని ఆయన చెప్పారు. ప్రతి గృహసారథికి 200 ఇళ్లకు సరిపడా ప్రచార సామగ్రి కిట్‌లో ఉంటుందన్నారు. కార్యక్రమంలో దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం, ద్వారకాతిరుమల, మండలాల కన్వీనర్లు కళ్లేపల్లి మాణిక్యం, నక్కా పండు, తానింకి సత్యనారాయణ, లక్కాబత్తుల రాజు తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలి



తాడిపర్రులో వరి చేనును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

గోపాలపురం: సాగులో పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలని.. వ్యవసాయ అధికారుల సూచనలను రైతులు పాటించాలని తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సీహెచ్‌వీ నరసింహారావు అన్నారు. గోపాలపురం మండలం పెద్దాపురం గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పొలంలో మిత్ర పురుగులు ఎక్కువగా ఉన్నందున పంటకు నష్టం లేదన్నారు. పంటలపై ఎక్కువగా పురుగు మందులు వినియోగించవద్దని సూచించారు. ఎస్.మాధవరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. అవసరమైన ఎరువులు, పురుగు మందులు 50 శాతం రాయితీపై ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం డీడీ ఎస్.బోసుబాబు, కొవ్వూరు ఏడీఈ పి.చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి బి.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: వరి చేలలో రైతులు యూరియాను వినియోగించవద్దని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు సూచించారు. తాడిపర్రులో వరి పైరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రబీ పంట పొట్ట దశకు చేరుకున్నందున యూరియాను వాడొద్దన్నారు. తాడిపర్రులో కొన్ని చేలల్లో మాత్రమే నీటి ముంపుతో జింక్ లోపం ఏర్పడిందన్నారు. మండలంలో రబీ పంట ఆశాజనకంగా ఉందన్నారు. డీడీఏ బోస్, ఏడీఏ రమేష్, శాస్త్రవేత్త నరసింహారావు, ఏఓ విశ్వాస రావు, ఎంపీటీసీ కట్టా వెంకటేశ్వరరావు, చొదరి పాల్గొన్నారు.

ఫిర్యాదుదారుడే నిందితుడు



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ క్రైం వెంకటేశ్వరరావు

- బ్లేడ్ బ్యాచ్ దాడి ఘటన అవాస్తవం
- వివరాలు వెల్లడించిన పోలీసులు

కంబాలచెరువు: తనపై బ్లేడ్‌బ్యాచ్ సభ్యులు దాడి చేసి, రూ.30 వేలు అపహరించుకుపోయారని పోలీసులను, మీడియాను తప్పుదోవ పట్టించిన వ్యక్తిపై మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. రాజమహేంద్రవరం ఇందిరానగర్ డంపింగ్ యార్డు వద్ద మంగళవారం రాత్రి పువ్వల పవన్‌కుమార్‌పై బ్లేడ్‌బ్యాచ్ సభ్యులు దాడి చేసి సొమ్ములు ఎత్తుకుపోయారంటూ వార్తలు హల్‌చల్ చేశాయి. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు. తప్పుడు ఫిర్యాదు ఇచ్చిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఆ వివరాలను దిశ పోలీస్ స్టేషన్ వద్ద గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్పీ క్రైం జి.వెంకటేశ్వరరావు వెల్లడించారు. పప్పులవీధిలోని వీరభద్ర మెడికల్ ఏజెన్సీలో పనిచేసే పవన్ కుమార్ మెడికల్ షాపుల వద్ద బాకీలు వసూలు చేసే పనిచేస్తుంటాడు. ఈ క్రమంలో కొంత సొమ్ము సొంతానికి వాడుకుని, అక్కౌంట్స్ బుక్‌లో అవకతవకలకు పాల్పడ్డాడు. దీనిలో భాగంగా గోకవరం వెళ్లి బాకీలు వసూలు చేసుకొచ్చాడు. తనకు తాను బ్లేడ్‌తో గాయపర్చుకుని రూ.30 వేలు బ్లేడ్ బ్యాచ్ ఎత్తుకెళ్లిపోయిందని యజమాని రామన్ అప్పన్ మణికంఠకు తెలిపాడు. అలాగే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు అసలు నిజం బయటపెట్టారు. డీఎస్పీ సంతోష్, త్రీటౌన్ సీఐ మధుబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత

నిడదవోలు రూరల్: హోప్ ఫర్ చిల్డ్రన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పట్టణంలోని చర్చిపేటలో బిలివర్స్ ఈస్టర్న్ చర్చిలో 80 మంది విద్యార్థులకు స్కూల్ షూలు గురువారం పంపిణీ చేశారు. హోప్ ఫర్ చిల్డ్రన్ ప్రాజెక్టు ద్వారా పేదలను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని సంస్థ రీజనల్ కోఆర్డినేటర్ రాఘవేంద్ర తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు భాస్కర్‌భట్ల రాజారామ్మోహన్ రాయ్, బిలివర్స్ ఈస్టర్న్ చర్చి సంఘ కాపరి ఎ.ప్రసన్నరాజు, ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడు దారపురెడ్డి ప్రతాప్, హారిక, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

కొవ్వూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఈ నెల 11వ తేదీ ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.ప్రసన్నకుమార్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ అనుమతితో ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారాయుడు) అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో మండలంలో వివిధ సమస్యలపై సభ్యులతో చర్చిస్తామన్నారు.

హుకుంపేటకు చేరుకున్న విజయేంద్ర సరస్వతి



హుకుంపేటలో కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ

గోపాలపురం: కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ మండలంలోని హుకుంపేటకు గురువారం చేరుకున్నారు. ఈ నెల 10, 11, 12 తేదీలలో హుకుంపేట గ్రామంలోని హోతా శ్రీరామచంద్రమూర్తి ఇంటి వద్ద జరిగే పలు హోమాల్లో ఆయన పాల్గొని పూజలు నిర్వహించనున్నట్లు ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. ఆయనకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వై కేటగిరీ భద్రత కల్పించినట్లు వివరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన



ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన కార్యక్రమంలో కవురు శ్రీనివాస్ తదితరులు

కొవ్వూరు: స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలపై మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులతో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ నెల 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ ఎమ్మెల్సీ ఎన్నికలకు మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ జరుగుతుందని ఎమ్మెల్సీ అభ్యర్థి కవురు శ్రీనివాస్ తెలిపారు. వైఎస్సార్ సీపీకి చెందిన ప్రజాప్రతినిధులకు ఓటు వినియోగించుకునే విధానంపై ఆయన అవగాహన కల్పించారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, ఎంపీపీలు కాకర్ల నారాయుడు, మట్టా వీరస్వామి, జొన్నకూటి పోసిరాజు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గండ్రోతు అంజనీదేవి, మండల పార్టీ అధ్యక్షులు సుంకర సత్యనారాయణ, చెల్లింకులు దుర్గా మల్లేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం నమోదు



బయ్యవరంలో కాలిపోయిన జీడిమామిడి చెట్ల వివరాలు తెలుసుకుంటున్న శ్రీనివాస్

తాళ్లపూడి: తాడిపూడి పరిధి బయ్యవరం కొండపై ఇటీవల జరిగిన ప్రమాదంలో జీడిమామిడి చెట్లు కాలిపోయాయి. గురువారం నష్టం అంచనా వేయడానికి కొవ్వూరు ఉద్యాన శాఖాధికారి శ్రీనివాస్ వచ్చారు. వీఆర్వోలు లీలావతి, ప్రవీణ్ తదితరులు ఆయనతో పాటు పంట నష్టం వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 640 జీడిమామిడి చెట్లు పూర్తిగా కాలిపోయినట్టు గుర్తించామన్నారు. పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. ఎకరాకు 70 వరకూ చెట్లు పెంచుతున్నట్టు రైతులు తెలిపారు. సచివాలయ సిబ్బంది ఈశ్వర్ భార్గవ, ఆనంద్, శ్రీరామ్, శ్యామ్‌ప్రసాద్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ బకాయిలు చెల్లించాలి

నిడదవోలు రూరల్: పెండింగ్‌లో ఉన్న డీఆర్‌లను విడుదల చేయడంతో పాటు 11వ పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘ అధ్యక్షుడు బలగం అప్పారావు తెలిపారు. పెన్షనర్ల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ నిడదవోలు తహసీల్దార్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సభ్యులు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి కీర్తి ఆంజనేయులు, కోశాధికారి ఎలిపిన శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన

చాగల్లు: ఆదాని ఆస్తులను వెంటనే ఈడీ అటాచ్ చేయాలని ఏఐసీసీ సభ్యుడు అమర్‌జహా బేగ్ మొహమ్మద్ అన్నారు. చాగల్లు ఎస్‌బీఐ వద్ద ఏఐసీసీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్ఐసీ, ఎస్‌బీఐల నుంచి అదానికి భారీ స్థాయిలో అప్పులు ఇచ్చారన్నారు. ప్రస్తుతం అదాని సంస్థలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, రూ.వేల కోట్లకు సమాధానం ఎవరు చెబుతారన్నారు. దీనిపై ఈ నెల 13న విజయవాడలోని రాజ్‌భవన్ ముట్టడి ఉంటుందని, కాంగ్రెస్ నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. నాయకులు మట్టా సుబ్బారావు, సాకా పుల్లారావు, సైెస్ సుబ్బారావు, జొన్నకుంట రవికుమార్, గల్లా భాస్కరరావు, బర్రె రమణ తదితరులు పాల్గొన్నారు.